క్లుప్తంగా

పౌష్టికాహారంపై అవగాహన

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకత, తల్లిపాల ఉపయోగాలు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. చోరంపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంటుమిల్లి ప్రాజెక్టు అధికారి (సీడీపీఓ) ఎం. సముద్రవేణి మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార కిట్ల ఉపయోగాలను వివరించారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది పలు సూచనలు చేశారు. సర్పంచ్ రేవు నాగలక్ష్మి, ఎంపీటీసీ తిరుమలశెట్టి లక్ష్మి, సూపర్‌వైజర్లు నాగలక్ష్మి పాల్గొన్నారు. లక్ష్మీనారాయణపురం, మణిమేశ్వరం గ్రామాల్లోను పౌష్టికాహార అవగాహన సమావేశాలు నిర్వహించారు.

ఎంపీఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణం పరిశీలన

కోడూరు: కోడూరు సచివాలయం పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌ను జిల్లా సహకార అధికారి ఫణికుమార్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పీఏసీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం గోడౌన్ పైభాగంలో గడ్డర్ల ఏర్పాటు పూర్తి చేసి, గోడల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు పీఏసీఎస్ సీఈఓ అర్జా వెంకటనగరాయులు వివరించారు.

బియ్యం, నిత్యావసరాలు పంపిణీ



చల్లపల్లి: నిరుపేద ఎస్టీలకు ఐవీఎం సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ కె.గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం నిరుపేద ఎస్టీలు 80 కుటుంబాల వారికి పురిటిగడ్డ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులను తహసీల్దార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



గూడూరు: గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1985 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు వంట సామగ్రిని అందజేశారు. జగనన్న గోరుముద్ద పథకం కోసం అవసరమైన స్టీల్ బకెట్లు, గరెటలను పాఠశాల హెచ్‌ఎం డి. పుష్పలతకు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెనుగొండ శ్రీనివాసరావు, బి. కుమార్, ప్రభాకర్, అయూబ్, నిరంజన్‌రావు, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్ష

చల్లపల్లి: కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 18 నుంచి జరుగనున్న పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కొక్కిలిగడ్డ నవీన్ కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించినప్పుడే మాదిగల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధి సాధ్యమన్నారు. సంఘ నాయకులు కొక్కిలిగడ్డ సువర్ణరాజు, కొడాలి ఏలియా, కొల్లూరి సురేంద్ర, మట్టా వంశీ, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

పెడన: ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం పెడన ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. 2022-23 ఏడాదిలో జరిగిన 1,413 పనులకు రూ.8.32 కోట్లకు సంబంధించి ఆడిట్‌లో వెల్లడైన అవకతవకలపై చర్చించారు. ఆయా గ్రామాల్లో జరిగిన పనులకు సంబంధించి నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఉపాధి కూలీల హాజరు క్లోజ్ చేసిన తరువాత కూడా హాజరు వేసి ఉండటం, హాజరు లేకపోయినా వేతనాలు చెల్లించడం, హాజరుకు, వేతనం చెల్లింపునకు పొంతన లేకపోవడం వంటివి పీడీ గుర్తించారు. సామాజిక తనిఖీలు నిర్వహించిన బృంద సభ్యులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు ఇష్టానుసారంగా పనులు చేసుకుంటూ పోతే ఊరుకునేది లేదన్నారు. వందరోజులు పని కల్పించకపోవడాన్ని తప్పుబట్టారు. వంద రోజులు పనులు చేయించని ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని, ఏపీఓ, ఎంపీడీఓ ఏమి చేశారని పీడీ ప్రశ్నించారు. ప్రస్తుత ఎంపీడీఓ రెడ్డయ్య మాట్లాడుతూ ఆ సమయంలో నేను లేనని, కొత్తగా వచ్చానని వివరణ ఇచ్చారు. తొలుత సభను ఉద్దేశించి ఎంపీపీ రాజులపాటి వాణి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీడీసీ ఏఎస్‌వీ నాంచారరావు, విజిలెన్స్ ఏవీఓ వి. శ్రీలత, ఎస్‌ఆర్‌పీ ఎన్. చిన్నబ్బాయి, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్యుతరావు, ఏపీఓ ముత్యాలు, ఈఓపీఆర్డీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్నకు చెబుదాం

- డీఆర్‌ఓ వెంకటరమణ
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోడూరు: ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఆర్‌ఓ వెంకటరమణ అన్నారు. శుక్రవారం కోడూరులోని దానాశక్తి ఆర్య వైశ్య ప్రార్థనా మందిరంలో 'జగనన్నకు చెబుదాం' ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందనతో పాటు 1902 నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను కూడా ఈ కార్యక్రమంలో చర్చించి, అవి పరిష్కారం కాకపోవడానికి గల కారణాలు, పరిష్కారమయ్యేందుకు ఉన్న వెసులుబాటును అర్జీదారులకు వివరించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి బుధ, శుక్రవారాలు మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో మాట్లాడి, సెల్ఫీ తీసుకుని, తగిన విచారణ నిర్వహించి, నిబంధనల మేరకు పరిష్కారం చూపుతారన్నారు. మండలంలో జగనన్నకు చెబుదాంలో రీ ఓపెన్ అయిన అర్జీలపై మండలాధికారులు తక్షణమే స్పందించి వీటిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వివిధ సమస్యలపై 55 అర్జీలు..

మండలంలోని వివిధ సమస్యలపై 55 అర్జీలను ప్రజలు అధికారులకు అందించారు. వి.కొత్తపాలెం గ్రామం మధ్య నుంచి వెళ్తున్న ఐదో నంబర్ చానల్ కాలువ కుడి, ఎడమ గట్లను ఆక్రమించారని, సర్వే చేయించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు అధికారులకు అర్జీ అందించారు. పోటుమీద గ్రామంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చెరువు తవ్వించి, తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు మరో అర్జీ అందించారు. ఉల్లిపాలెంలో కోతుల బెడద అధికంగా ఉందని, కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ విశేషంగా ఆకట్టుకుంది. చిరుధాన్యాల వల్ల ఉపయోగాలను వివరిస్తూ పలు వంటకాలు చేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారాన్ని వివరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని నిర్వహించారు. అర్జీదారుల ఫిర్యాదులను నమోదు చేసేందుకు సచివాలయ సిబ్బంది హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశారు. జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డెప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ పీఎస్‌ఆర్ ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎస్. సువర్ణ, డీపీఓ నాగేశ్వరనాయక్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ టీవీఎం రామదాసు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



మర్రిపాలెంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, వైద్యాధికారులు

గూడూరు: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది పూర్తి స్థాయి సేవలను అందించడం ద్వారా కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. జెడ్పీటీసీ వేముల సురేష్‌రంగబాబు, ఎంపీడీఓ డి. సుబ్బారావు, మల్లవోలు వైద్యాధికారి పి. మాధురి, వైఎస్సార్ సీపీ నాయకులు పర్లం పెదబాబు, గమని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల వైద్యాధికారుల సమావేశం నిర్వహించారు. పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కె. హారిక, మోపిదేవి పీహెచ్‌సీ డాక్టర్ లక్ష్మీనాథ్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వివరాలు తెలిపారు. మండలంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 12వ తేదీ వరకు నిర్వహించే జగనన్న సురక్ష శిబిరాల షెడ్యూల్స్‌ను ప్రకటించారు. తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, ఎంఈఓ విద్యాసాగర్, మండల వైద్యాధికారులు ఎస్. శ్రీరామ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక: జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) ప్రచార కార్యక్రమం మర్రిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రారంభించారు. తొలుత తహసీల్దార్ జె.వి మలకుమారి, ఎంపీడీఓ శ్రీనివాసరావు జేఏఎస్ బ్రోచర్లు ఆవిష్కరించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరమని చెప్పారు. సచివాలయాల పరిధిలో అక్టోబరు 3వ తేదీ వరకు ప్రీ క్యాంపెయిన్ జరుగుతుందని, ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 17 వరకు షెడ్యూల్ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వివరించారు. కార్యక్రమంలో మండలంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.శివరామకృష్ణ, కె.శ్యామ్‌ప్రసాద్, ఫాతిమున్నీసా, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెడన మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ అధ్యక్షతన 1, 2, 3, 4 సచివాలయాల్లోని వలంటీర్లు, గృహ సారథులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ ఖాజా, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య



కళాజాతా కళాకారులతో న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): ప్రతి ఒక్కరూ బాలల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. తాళ్లపాలెం, కోన గ్రామాల్లో బాలల హక్కుల పరిరక్షణపై న్యాయవిజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్నాయని సమాచారం వస్తే వెంటనే నియంత్రించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోత్స్నదేవి, కె సుధారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.

గ్రామాల్లో 'నా మట్టి-నాదేశం'

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు నా మట్టి-నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్లేశ్వరం, నారాయణపురం, పాశ్చాపురం గ్రామాల్లో గ్రామస్తులతో కలిసి మట్టిని సేకరించారు. సేకరించిన మట్టిని ఢిల్లీలో నిర్మించనున్న స్వాతంత్ర్య సమరయోధుల స్మారక భవన నిర్మాణంలో వినియోగిస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగల మురళీకృష్ణ, మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆంజనేయులు, జె. కిరణ్‌గుప్త, ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వరరావు, దేవరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మండల ఏఓగా హెప్సిబారాణి

మోపిదేవి: మండల వ్యవసాయాధికారి (ఏఓ)గా కొక్కిలిగడ్డ హెప్సిబారాణి బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని గొల్లపూడి ఎస్‌టీఎల్ ల్యాబరేటరీస్ నుంచి మ్యూచువల్ బదిలీలో భాగంగా ఇక్కడకు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ శ్రీనివాస్ గొల్లపూడి ల్యాబరేటరీస్‌కు బదిలీ అయ్యారు. రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను వారికి సకాలంలో చేరువేస్తూ, సాగులో వచ్చే అనుమానాలు నివృత్తి చేస్తామని ఆమె తెలిపారు.

రసవత్తరంగా ఫెడరేషన్ స్కూల్ గేమ్స్



కబడ్డీ ఆడుతున్న నాగాయలంక బాలురు

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి అండర్-14, అండర్-17 బాలుర ఆటల పోటీలు రసవత్తరంగా సాగాయి. 150 మంది బాలురు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, గుర్తింపు పొందిన విద్యాసంస్థల బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాల్ బాడ్మింటన్, షటిల్ బాడ్మింటన్, రన్నింగ్ పోటీలు, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్, జావలిన్‌త్రో ఈవెంట్స్ జరిగాయి. తలగడదీవి, భావదేవరపల్లి, ఎదురుమొండి, ఏటిమొగ, నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు, క్రీడా జట్లను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేస్తామని మండల స్పోర్ట్స్ కన్వీనర్ సుబ్బారావు తెలిపారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

మోపిదేవి: మండల స్థాయి బాలబాలికల క్రీడా పోటీలు రెండు రోజులపాటు నిర్వహిస్తామని ఎంఈఓ-1 విద్యాసాగర్ తెలిపారు. స్థానిక ఆశ్రమ పాఠశాల ఆవరణలో శుక్రవారం బాలుర అండర్-14, అండర్-17 విభాగాల బాల, బాలికల ఆటల పోటీలు ప్రారంభించారు. తొలి రోజు బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌పై పోటీలు నిర్వహించి విజేతలుగా ఎంపికైన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. మండల స్థాయిలో మొత్తం 200 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

చల్లపల్లి: విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌ఆర్‌వైఎస్‌పీ హైస్కూల్‌లో మండల స్థాయి నేషనల్ స్కూల్ గేమ్స్‌ను జెడ్పీటీసీ ప్రారంభించారు. అండర్-14, అండర్-17 కేటగిరీల్లో తొమ్మిది రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, ఎంఈఓ-2 పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రసన్న గణపతి వార్షికోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



ఉత్సవాల కోసం నిర్మించిన భారీ పందిరి



ప్రసన్న గణపతి దేవస్థానం. స్వామివారు

నాగాయలంక: జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన నాగాయలంక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 66వ వినాయక నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. దేవస్థానం కమిటీ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 15 రోజులు జరిగే ఉత్సవాలకు భారీ పందిరి ఏర్పాటు చేశారు. 18వ తేదీన స్వామి వారి 12 అడుగుల ఉత్సవ విగ్రహం మందిర ప్రవేశంతో వార్షిక ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ప్రారంభిస్తారు. 15 రోజులకు పైగా నిత్యం హరికథలు, బుర్రకథలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, కోలాటం, భజనలు జరుగుతాయని ఉత్సవ కమిటీ వారు తెలిపారు. ఉత్సవాల ముగింపు రోజుల్లో సాంఘిక, పౌరాణిక, జానపద నాటకాల ప్రదర్శన ఉంటుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని దేవస్థానం కమిటీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు కోరారు.

మోక్షగుండం సేవలు చిరస్మరణీయం

పేర్ని కిట్టు



విశ్వేశ్వరయ్య, నరసింహారావు విగ్రహాలను ఆవిష్కరించిన మేయర్ వెంకటేశ్వరమ్మ, కిట్టు



కృష్ణా యూనివర్సిటీలో నివాళులర్పిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: భారత దేశాభివృద్ధిలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య కీలకపాత్ర పోషించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక సర్కారుతోట స్విమ్మింగ్‌పూల్ వద్ద విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విశ్వేశ్వరయ్య, మచిలీపట్నానికి చెందిన ఇంజినీరు చలమలశెట్టి నరసింహారావు విగ్రహాలను నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు ఆవిష్కరించారు. విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పేర్ని కిట్టు మాట్లాడుతూ దేశంలో పలు ప్రాజెక్టుల నిర్మాణానికి విశ్వేశ్వరయ్య రూపకల్పన చేశారన్నారు. రాష్ట్రానికి చెందిన విశ్వేశ్వరయ్య బెంగళూరులో పలు నిర్మాణాలు చేసి అభివృద్ధికి కృషి చేశారన్నారు. మచిలీపట్నంలో పలు నిర్మాణాలకు నరసింహారావు కృషి చేశారన్నారు. ఎంతో మంది ఇంజినీర్లను ఆయన తయారుచేసి ఉపాధి కల్పించారని చెప్పారు. మచిలీపట్నం లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీఎస్ మురళీధర్ అధ్యక్షతన జరిగిన సభలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, పలువురు ఇంజనీర్లు, నరసింహారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు విజయలక్ష్మి, భారతిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మచిలీపట్నం లైసెన్స్‌డ్ ఇంజినీర్ల సంఘం కార్యదర్శి సుబ్బారావు, నాయకులు గోపాల్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో..

నగరంలోని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మన్నెం భాస్కరరావు, ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బంది విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మచిలీపట్నం ఏడీఈ రామకృష్ణ, టెక్నికల్ ఏఈ నాగలక్ష్మి, ఎకౌంట్స్ ఆఫీసర్ షణ్ముఖి, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య జీవితంలో ప్రతి అంశాన్ని అన్వయించుకోవాలి..

చిలకలపూడి(మచిలీపట్నం): మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితంలో ప్రతి అంశాన్ని మన జీవితాలకు అన్వయించుకున్నప్పుడే ఇంజినీర్స్ డే కు సార్థకత ఏర్పడుతుందని విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జి. జ్ఞానమణి అన్నారు. కృష్ణా యూనివర్సిటీలో ఇంజినీర్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం వీసీ జ్ఞానమణి మాట్లాడారు. కావేరి నదిపై నిర్మించిన కృష్ణరాజ సాగర్ ఆనకట్ట ఆది నుంచి విశ్వేశ్వరయ్య పర్యవేక్షణలోనే జరిగిందన్నారు. తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులో కూడా ఆయన తోడ్పాటును మరువలేమని చెప్పారు. ఇంజినీరింగ్ విద్యార్థులు విశ్వేశ్వరయ్య ఆలోచనలను పరిగణనలోకి తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి. వీరబ్రహ్మాచారి, ప్రిన్సిపాల్ ఆర్. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జాబ్‌మేళాలో 79 మంది ఎంపిక



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

అవనిగడ్డ: స్థానిక ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థ ప్రాంగణంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి డి. విక్టర్‌బాబు జాబ్‌మేళాను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు జాబ్ మేళా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు ఇలాంటి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో మొత్తం 13 కంపెనీలు పాల్గొన్నాయని చెప్పారు. 218 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా 79 మందిని ఎంపిక చేశారని తెలిపారు. వీరిలో 34 మంది తరువాత ఇంటర్వ్యూకి అర్హత సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యనిర్వాహకులు దామా వెంకట సందీప్, జిల్లా నియామక కార్యనిర్వాహకులు తుర్లపాటి మధు, హెచ్‌ఆర్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ కావ్య, ఈఎస్‌సీ కో-ఆర్డినేటర్ ప్రశాంత్, అవనిగడ్డ స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పృథ్విజ, 13 కంపెనీల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాపు నేస్తం చెక్కుల పంపిణీ

పెడన: పెడన నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగో విడత కాపు నేస్తం చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని పేద కాపు అక్క చెల్లెమ్మలకు కాపు నేస్తం పథకం ద్వారా రూ.15 వేల నగదును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు. శనివారం ఉదయం 9 గంటలకు కృత్తివెన్ను మండలంలోని కాపు నేస్తం లబ్ధిదారులకు గుడిదిబ్బ నాగేశ్వరస్వామి దేవస్థానం వద్ద, బంటుమిల్లిలోని వారికి ఉదయం 10.30 గంటలకు బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోను, పెడన పట్టణం, రూరల్ వారికి మధ్యాహ్నం 2 గంటలకు పెడన మార్కెట్ యార్డు ఆవరణలోను, గూడూరు మండలంలోని వారికి మధ్యాహ్నం 3 గంటలకు సుమా కన్వెన్షన్ హాల్‌లోనూ నమూనా చెక్కులను అందజేస్తారని వివరించారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఇలా..

పెడన నియోజకవర్గంలో కాపు నేస్తం పథకం ద్వారా నాలుగో ఏడాది లబ్ధి పొందనున్న కాపు అక్కచెల్లెమ్మల వివరాలు మండలాల వారీగా తెలిపారు. కృత్తివెన్ను మండలంలో 1,143 మందికి రూ.1,73,45,000, బంటుమిల్లిలో 874 మందికి రూ.1,31,10,000, పెడన పట్టణంలో 175 మందికి రూ.26.25 లక్షలు, పెడన రూరల్‌లో 754 మందికి రూ.1,13,10,000, గూడూరు మండలంలో 1,543 మందికి రూ.2,31,45,000 నగదు జమ కానుందని చెప్పారు.

చేయూతతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

నాగాయితిప్ప(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ చేయూత పథకాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, మోర్ల జ్యోత్స్న అన్నారు. నాగాయితిప్ప సచివాలయం వద్ద శుక్రవారం చేయూత పథకంపై డ్వాక్రా మహిళల సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో నాలుగో విడత వైఎస్సార్ చేయూత నిధులు విడుదల అవుతాయన్నారు. సచివాలయం పరిధిలో 129 మందికి గాను రూ. 24,18,750 పంపిణీ చేయనున్నారన్నారు. ఈ నిధులు సక్రమంగా వినియోగించుకుని తాము ఏర్పాటు చేసిన యూనిట్స్ ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, లింగం జగదీష్‌కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, గ్రామ సచివాలయ కన్వీనర్ తాతా శ్రీకాంత్, బుక్ కీపర్లు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు

పెడన: నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాలలోని సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించారు. ప్రతిభను చూపిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం బహుమతులందించారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు దోసపాటి బాబా, తమ్మన సాయికుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్‌ఎస్ రెడ్డి, సివిల్ హెచ్‌ఓడీ గిరిఫణికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

బంటుమిల్లి: స్థానిక రజక వీధిలోని గంగానమ్మ, నెల్లులమ్మ నెల జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా నెల లోపు సంబరాన్ని కమిటీ సభ్యులు ముందుగా నిర్వహించారు. ఇందులో భాగంగా మేళతాళాలతో గంగానమ్మ, నెల్లులమ్మ, పోతురాజుల ఘటాలతో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు వీధుల్లో నీళ్ల వారబోసి హారతులు ఇచ్చారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మచిలీపట్నం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు పాత హౌసింగ్ బోర్డు, పీకేఎం కాలనీ, డ్రైవర్స్ కాలనీ, గుమాస్తాల కాలనీ ప్రాంతాల్లో, ఉదయం 7 నుంచి 10 గంటల వరకు చిలకలపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీఓ కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎల్‌ఐసీ కాలనీ, దిమ్మల సెంటర్, భాస్కరపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.